క్లుప్తంగా

భాగ్యరెడ్డి వర్మకు నివాళి



భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నేతలు

కుత్బుల్లాపూర్: దళిత నాయకుడు భాగ్యరెడ్డి వర్మ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం షాపూర్‌నగర్ ఉషోదయ టవర్స్‌లో ఆయన చిత్రపటానికి దళిత సంఘాల నేత జేమ్స్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. భాగ్యరెడ్డి వర్మ తన జీవితాంతం దళితుల అభ్యున్నతికి పాటు పడిన మహోన్నతుడని కొనియాడారు.

నేడు ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా బైక్ ర్యాలీ

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి జిల్లా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి ఉత్సవాలు పురస్కరించుకుని భారీ బైక్ ర్యాలీ, పాదయాత్ర నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటలకు మియాపూర్ మార్కెట్ శివాలయం నుంచి లింగంపల్లి తుల్జాభవానీ దేవాలయం వరకు ఈ ర్యాలీ కొనసాగుతుందన్నారు. అనంతరం లింగంపల్లిలోని తుల్జాభవానీ దేవాలయం వద్ద భోజన ఏర్పాట్లు చేసినట్లు విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు తెలిపారు.

దుప్పట్లు, పండ్లు పంపిణీ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జన్మదిన వేడుకలు ఆదివారం జరగనున్నాయి. ఈ సందర్భంగా శనివారం స్మైల్ ఏ గిఫ్ట్ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొట్టు విష్ణు ఆధ్వర్యంలో శివానంద ఆసుపత్రిలో రోగులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావు, బీఆర్‌ఎస్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ సతీష్ అరోరా, నియోజకవర్గ ఎస్సీ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షుడు, సెక్రటరీలు పాల్గొన్నారు.

గొలుసు దొంగకు దేహశుద్ధి

భాగ్యనగర్‌కాలనీ: మహిళ కళ్లల్లో కారం చల్లి గొలును లాక్కెళ్లేందుకు యత్నించిన వ్యక్తిని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఈ సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సీఐ నర్సింగ్‌రావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కూకట్‌పల్లి బాలకృష్ణ నగర్‌కు చెందిన నీరజ చిత్తారమ్మ సమీపంలో వారాంతపు సంతలో కూరగాయలు కొనుక్కుని తిరిగి వస్తుండగా ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె కళ్లల్లో కారం చల్లి గొలును లాక్కునేందుకు యత్నించాడు. నీరజ కేకలు వేయడంతో అప్రమత్తమైన ఆమె భర్త అశోక్‌తో పాటు స్థానికులు నిందితుడిని పట్టుకొని దేహశుద్ధి చేసి కూకట్‌పల్లి పోలీసులకు అప్పగించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని విచారించగా జీడిమెట్లలోని ఎస్ఆర్ నాయక్‌నగర్‌కు చెందిన సంతోష్ అగర్వాల్ గా పేర్కొన్నాడు. గతంలో ఓ దొంగతనం కేసులో జైలుకు వెళ్లి తిరిగి వచ్చినట్లుగా పోలీసులు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం



బృందావన్ కాలనీలోని టీవీఎస్ రెసిడెన్సీలో ఎగసిపడుతున్న మంటలు

నిజాంపేట్: ఏసీలో షార్ట్ సర్క్యూట్ తలెత్తడంతో అపార్ట్‌మెంట్‌లో మంటలు వ్యాపించిన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నిజాంపేట బృందావన్ కాలనీలోని టీవీఎస్ రెసిడెన్సీ ఫ్లాట్ నెంబర్ 201లో శనివారం మధ్యాహ్నం ఏసీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఇంటి యజమాని సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో బెడ్, ఇతర సామాగ్రి కాలిపోయాయని, ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లలేదని బాచుపల్లి పోలీసులు తెలిపారు. ఫ్లాట్ యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆల్విన్‌కాలనీలో..

కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆస్‌బెస్టాస్ కాలనీకి చెందిన సయ్యద్ అన్వర్ నివాసంలో శనివారం షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పంటుకుని గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. దీనిపై సమాచారం అందడంతో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావుతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటానన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆర్థికసాయం అందేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, ఆస్‌బెస్టాస్ కాలనీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, పార్టీ నాయకుల అబ్దుల్, ఖయ్యుమ్, కృష్ణ, రఫీక్, రజాక్, శ్రీజ్యోతి, కుమారి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్..అదుర్స్

నిజాంపేట్‌లోని సద్గురు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందుతున్న 4వ తరగతి విద్యార్థి సత్యవోలు మౌక్తిక మహా శివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గోడపై 8 అడుగుల ఎత్తు, 15 అడుగుల వెడల్పులో పరమశివుని చిత్రాన్ని గీసి అబ్బుర పరిచింది.. సద్గురు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు సత్యవోలు రాంబాబు కుమార్తె మౌక్తిక చిన్నతనం నుండే విభిన్న పెయింటింగ్‌లలో ప్రతిభను చాటుతోంది..

– నిజాంపేట్



అంతా శివమయం..

కుత్బుల్లాపూర్: మహా శివరాత్రిని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు.. ఉదయం నుంచి ఆలయాల్లో అభిషేకాలు,హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి దర్శనానికి ఉదయం నుంచి భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చలువ పందిళ్లు వేశారు. సూరారం ఉమామహేశ్వర ఆలయం, సుభాష్‌నగర్‌లోని కాశీ విశ్వేశ్వర ఆలయం, చెరుకుపల్లి కాలనీ, జగద్గిరిగుట్ట, హెచ్‌ఎంటీ, జీడిమెట్ల గ్రామాల్లో శివాలయాలు 'హర హర మహాదేవ.. శంభో శంకర..' నామస్మరణలతో మారుమోగాయి..



నిజాంపేట్ శివాలయంలో పూజల్లో పాల్గొన్న బీఆర్‌ఎస్ నేత కొలన్ శ్రీనివాస్‌రెడ్డి..



మహదేవపురంలోని శివాలయంలో అర్ధనారీశ్వర అలంకరణలో అన్నపూర్ణదేవి..



సుభాష్‌నగర్ కాశీ విశ్వేశ్వర ఆలయంలో ..



చెరుకుపల్లి కాలనీలోని శివాలయంలో..



కొంపల్లి శివాలయంలో పూజల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ శ్రీశైలంయాదవ్, సన్న కవిత దంపతులు..

బీఆర్‌ఎస్ పార్టీలో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ, పీజేఆర్‌నగర్‌కు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సమక్షంలో బీఈఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గాంధీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. ప్రతి ఒక్కరు బీఆర్‌ఎస్ పార్టీ ప్రతిష్టకు కృషి చేయాలన్నారు. పార్టీలో అందరికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ బంగారు తెలంగాణ కోసం ఎంతో కృషి చేస్తున్నారని, మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వాసుదేవరావు, పోశెట్టి గౌడ్, అనీల్, మోజెస్, రాము తదితరులు పాల్గొన్నారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో జాగిరి రాజు, వేణు, భిక్షపతి, రమేష్, పరశురాం, రోహిణి, సునీత, మమత, లింగమ్మ, నరేందర్, శిరీష, శ్రీను, లాస్య తదితరులు ఉన్నారు.

'బార్న్ ఫర్ పూర్' ఆధ్వర్యంలో ఆరెంజ్ జ్యూస్ పంపిణీ

ఆల్విన్‌కాలనీ: మహాశివరాత్రి సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ మహంకాళి చౌరస్తాలో బార్న్ ఫర్ పూర్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు మంజునాథ్, నరేందర్ యాదవ్, రఘు వారి మిత్రులు ఆధ్వర్యంలో శనివారం ఆరెంజ్ జ్యూస్ పంపిణీ చేశారు. ర్యక్రమంలో బీజేవైఎం నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమార్ యాదవ్ పాల్గొని పాదాచారులకు, వాహనదారులకు ఆరెంజ్ జ్యూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాత్రి పర్వదినాన ప్రజలకు సేవ చేసే అవకాశం దొరకడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో టీవీబీ రెడ్డి, శ్రీకాంత్, రాకేష్, వెంకట్, ఫిరోజ్, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతాం



శ్రీరంగవరంలో మహిళలతో మాట్లాడుతున్న హరివర్ధన్‌రెడ్డి

మేడ్చల్: నియోజకవర్గంలోని ప్రతీ గడపకు వెళ్ళి ప్రభుత్వ వైఫల్యాలను వివరించి కాంగ్రెస్ గతంలో ప్రజలకు ఏం చేసింది తిరిగి అధికారంలోకి వస్తే ఏం చేస్తుందో వివరిస్తామని పీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. పీసీసీ చేపట్టిన హత్ సే హత్ జోడో యాత్ర స్ఫూర్తిగా మేడ్చల్ మండలం శ్రీరంగవరం గ్రామంలో యాత్ర నిర్వహించి ఇంటింటికీ వెళ్ళి కరపత్రాలు ఇచ్చారు. పార్టీ జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో మేడ్చల్ నియోజకవర్గం పూర్తిగా వెనుకపడిపోయిందని, పేద పిల్లలు చదవుకోవడానికి కనీసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకుండా పోయిందని అన్నారు.పట్టణాలలో ఎన్నో సమస్యలు తాండవం చేస్తున్నాయని ప్రతీ సమస్యపై నిరంతరం పోరాటం చేస్తునే ప్రజలకు ప్రభుత్వ వైఫల్యలను వివరిస్తామని అన్నారు. ఎమ్మెల్యేగా మంత్రి మల్లారెడ్డి ఏనాడు ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. అసెంబ్లీలో నియోజకవర్గ ప్రజల సమస్యలను లేవనెత్తి పరిష్కారాలు సాధించకుండా అసెంబ్లీ సమావేశాలలో కామెడీలు చేస్తూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల భజనలు చేస్తున్నారని విమర్శించారు.. కార్యక్రమంలో నాయకులు జీనత్‌రెడ్డి, పోచయ్య, బాల్‌రెడ్డి, మల్లారెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహేష్ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

కోడ్ నేపథ్యంలో ఫ్లెక్సీల తొలగింపు

మేడ్చల్: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను అధికారులు తొలగించారు. మండలంలోని గుండ్లపోచంపల్లి-నూతన్‌కల్ రోడ్డులో గౌడవెళ్ళి పరిధిలో కాంగ్రెస్ కు చెందిన సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ శివరాత్రి సందర్భంగా గుడిబండ ఆలయానికి వస్తున్న భక్తులకు స్వాగతం తెలుపుతూ భారీ గా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. గ్రామస్థుల ఫిర్యాదుతో రెవెన్యూ, పోలీసులు, గ్రామ పంచాయతీ అధికారులు బృందంగా వెళ్ళి శనివారం ఫ్లెక్సీలను తొలగించారు.ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందునే ఫ్లెక్సీలను తొలగించామని అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓఆర్ఆర్ మూసీ వంతెన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మరణించాడు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన మేరకు.. రాజస్థాన్‌కు చెందిన ధూళీ చంద్ (47) ఓఆర్ఆర్ రోడ్డు మరమ్మతు పనులు చేయడానికి వచ్చారు. శనివారం సాయంత్రం దూళీచంద్ పనులు పూర్తి కాగానే ఓఆర్ఆర్ మూసీ వంతెన వద్ద రేలింగ్ పక్కన నిలబడ్డాడు. అదే సమయంలో స్విఫ్ట్ కారులో డ్రైవర్ చల్లమల్లి శరత్ అతడి స్నేహితులు వెంకటేశ్, నవీన్, ధీరజ్, ఆజెయ్ తార్నాకీపేట్ నుంచి వేగంగా వస్తూ నిలబడి ఉన్న ధూళీ చంద్‌ను ఢీకొట్టారు. దీంతో తీవ్ర గాయాలై ధూళీచంద్ అక్కడికక్కడే మరణించగా వెంకటేశ్, ధీరజ్‌కు గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స కోసం ఈసీఐఎల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి, మృత దేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. స్నేహితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

హర హర మహాదేవ



కీసరగుట్టపై యాత్రికుల రద్దీ

కీసర: ప్రముఖ శైవక్షేత్రమైన కీసరగుట్ట శనివారం శివనాస్మరణతో మార్మోగింది. మహాశివరాత్రి పర్వదినం రోజున శివుడిని దర్శించుకుంటే మంచిజరుగుతుందన్న నమ్మకంతో శ్రీరామలింగేశ్వరుడిని దర్శించుకునేందుకు తెల్లవారుజామునుండే భక్తులు క్యూలైన్లలో నిల్చున్నారు. ఉదయం 11 గంటల సమయంలో ధర్మదర్శన క్యూలైనులోభక్తులు హుడా పార్కు వరకు వేచియున్నారు. సాయంత్రం వరకు వేలాదిమంది స్వామివారిని దర్శించుకున్నారు. శనివారం సాయంత్రం భక్తులు ఉపవాస దీక్ష విరమించారు. అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్యన్, డీసీపీ జానకి, ఏసీపీ వెంకట్ రెడ్డి, కీసర సీఐ రఘువీర్‌రెడ్డి తదితర పోలీస్ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు క్యూలైన్లలో పరిస్థితిని పర్యవేక్షించారు.

స్వామిసేవలో పాల్గొన్న ప్రముఖులు

మంత్రులు చామకూర మల్లారెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బేతిసుభాష్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్, ఎమ్మెల్సీ సురభివాణిరెడ్డి, జెడ్పీచైర్మెన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, పలువురు న్యాయమూర్తులు, సీఎంపేషి అధికారులు, వివిధ శాఖలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరుడిని దర్శించుకున్నారు.

నేటి పూజాకార్యక్రమాలు

బ్రహోత్సవాల్లో బాగంగా నాల్గోరోజైన ఆదివారం ఆలయంలో ఉదయం 5.30 గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకము. ఉదయం 6 నుండి సాయంత్రం వరకు కళ్యాణమండపంలో సామూహిక అభిషేకములు, ఉదయం 9 గం. రుద్రస్వాహాకార హోమము, రాత్రి 7 గం, ప్రదోషకాల పూజ హారతి మంత్రపుష్పము, రాత్రి 7 గం. శ్రీస్వామివారివిమాన రథోత్సవము ఉంటుంది.

రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

చింతల్: ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ టీఆర్‌ఎస్ పాలనలో అప్పుల పాలైందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ప్రజాగోస- బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా శనివారం భగత్‌సింగ్‌నగర్‌లోని శక్తి కేంద్రంలో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తొమ్మిదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాడని, ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ ను అప్పుల పాలు చేశాడని ఆరోపించారు. కేసీఆర్ గ్రాఫ్ ప్రజల్లో బాగా పడిపోవడంతో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు భయం పట్టుకుందని, అందుకే ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న వారిపై ఎమ్మెల్యేలు తమ అనుచరులతో దాడులు చేయిస్తున్నారన్నారు. ఎప్పుడు ఎన్నికలు నిర్వహించినా రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, డివిజన్ అధ్యక్షులు పత్తి సతీష్, సదానందం, శక్తి కేంద్ర ఇంఛార్జ్ ఆదిత్య, బూత్ అధ్యక్షులు నాగరాజు, రాజ్‌పుత్ రోహిత్, సంగం, నాయకులు భానుచందర్, జితేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ఘట్‌కేసర్: చౌదరిగూడ మక్త గ్రామంలో నిర్మిస్తున్న శ్రీ మహంకాళీ అమ్మవారి ఆలయం, శివాలయం పునర్ నిర్మాణానికి ఆ గ్రామ వార్డు సభ్యురాలు బండ్లగూడ వాణినాగేశ్ దంపతులు విరాళమిచ్చారు. వార్డు సభ్యురాలి నివాసంలో శనివారం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు రూ. 51,116లు విరాళం అందజేశారు. కార్యక్రమంలో పాండుగౌడ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

మేడ్చల్‌రూరల్: చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గౌడవెల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రఘురాం తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గౌడవెల్లి చెరువులో శనివారం ఉదయం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడు అయోధ్య చౌరస్తా వద్ద నివాసం ఉంటున్న నాగల్ల సత్యనారాయణ(26)గా గుర్తించారు. మృతుడు ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు పోసులును కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్కడ చూసినా చెత్త గుట్టలే..

రంగారెడ్డినగర్: జంట సర్కిళ్ల పరిధిలో పారిశుధ్య నిర్వహణ అటకెక్కింది.. కాలనీలు, బస్తీల్లోని ఏ రోడ్డు చూసినా రోజుల తరబడి చెత్తను తరలించకపోవడంతో గుట్టలను తలపిస్తున్నాయి.. సూరారం కాలనీ డివిజన్ షాపూర్‌నగర్ హెచ్‌ఎంటీ సొసైటీ కాలనీలో నాలుగైదు రోజులుగా రోడ్లపై డంప్ చేస్తున్న చెత్తను తరలించడం లేదు. దీంతో దుర్గంధం వెదజల్లుతోందని, దోమల కారణంగా రాత్రిళ్లు నిద్రకు దూరవుతున్నామని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోజువారీ పారిశుధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



హెచ్‌ఎంటీ సొసైటీ రోడ్డులో పేరుకుపోయిన చెత్త

భారతీ సిమెంట్స్ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న కామాక్షి అధినేత శ్రీనివాస్‌గౌడ్, భారతి సిమెంట్స్ ప్రతినిధి మల్లారెడ్డి తదితరులు

రంగారెడ్డినగర్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ఉపవాస దీక్ష చేపట్టిన భక్తులకు చింతల్ ద్వారకాపురి కాలనీలోని శివాలయంలో కామాక్షి అధినేత శ్రీనివాస్‌గౌడ్, భారతి సిమెంట్స్ ప్రతినిధి మల్లారెడ్డి ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మహా శివరాత్రి రోజు ఉపవాస దీక్ష చేపట్టడం ఎంతో పుణ్యమని, దీక్ష విరమించిన వారికి పండ్లు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. సదాశివుడు అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని ఆయన ఆకాక్షించారు. కార్యక్రమంలో భారతి సిమెంట్స్ బ్రాంచ్ మేనేజర్ టి.సతీష్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ వైభవం

- కీసర గుట్ట బ్రహ్మోత్సవాల్లో మూడోరోజు విశేషాలు
- కీసరగుట్టకు వచ్చిన యాత్రికులకు , క్యూలైన్లలో నిల్చున్న భక్తులకు నగరంలోని సోలీస్ ఐ ఆసుప్రతి నిర్వాహకులు పాలతోపాటు, మంచినీటి ప్యాకెట్లను అందజేసారు.
- ఈ ఏడాది వీఐపీ దర్శన టికెట్లు పరిమిత సంఖ్యలో పంపిణీ చేయడంతో కొద్దిమేర వీఐపీ క్యూలైన్ రద్దీ తక్కువగా కనిపించింది. అయితే ఈక్యూలైన్‌లోనే ఆన్‌లైన్‌లో దర్శనం బుక్‌చేసుకున్న భక్తులను పంపడంతో ఆన్‌లైన్‌లో టిక్కెటు బుక్‌చేసుకున్న యాత్రికులు ఇబ్బందులు పడ్డారు.
- పార్కింగ్ నుండి దేవాలయం వరకు ఈసారి 8 మిని బస్సులను ఏర్పాటు చేసినప్పటికి యాత్రికులకు ఇక్కట్లు తప్పలేదు.



కీసర రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం

- ధర్మదర్శనంలో స్వామి వారి దర్శనానికి 3 గంటల సమయంపట్టింది.
- కీసరగుట్ట యాత్రికులకు కీసర రెడ్డి సంక్షేమసంఘం, స్థానిక మార్వాడి సంఘం,ఆర్యవైశ్యసంఘం, వంశరాజ్ సంక్షేమసంఘం, శ్రీరామలింగేశ్వర మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.